సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 6-11-2024

సంపుటి: 20 సంచిక: 189

పేజీలు: 4 వెల: రూ.1

## మెగా డీఎస్సీ వాయిదా

**(సత్యంన్యూస్, అమరావతి)**

రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ 2024 ప్రకటన వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల డీఎస్సీ ప్రకటనను అధికారులు వాయిదా వేశారు. సోమవారం టెట్ ఫలితాలను ప్రకటించిన అధికారులు.. మరో రెండురోజుల వ్యవధిలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడుతుందని పాఠశాల విద్యాశాఖ నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. దీంతో వెంటనే మెగా డీఎస్సీని కూడా విడుదల చేస్తారని అంతా ఆశించారు. కానీ ఊహించని రీతిలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. దీంతో ఎప్పటికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారనే దానిపై స్పష్టత కొరవడింది. ప్రస్తుతానికి డీఎస్సీని తాత్కాలికంగా వాయిదా వేశారు. మరో వైపు మెగా డీఎస్సీ వాయిదా పడటానికి ఎస్సీ రిజర్వేషన్లే కారణమని తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే వరకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయకూడదని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వర్గీకరణ పూర్తయ్యే వరకు డీఎస్సీ ప్రకటన ఇవ్వడానికి వీలులేదని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తుంది. ఈ క్రమంలోనే మంగళవారం సీఎం చంద్రబాబుతో మంద కృష్ణమాదిగ భేటీ అయ్యారు. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి పలు అంశాలను సీఎంతో చర్చించారు. కూటమి సర్కారు కొలువుతీరిన తొలిరోజునే 16,317 పోస్టులను భర్తీ చేసేలా మెగా డీఎస్సీ ఫైల్పై సీఎం చంద్రబాబు సంతకం చేశారు. ఇందులో ఎస్జీటీ 6371 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7725 పోస్టులు, టీజీటీ 1781 పోస్టులు, పీజీటీ 286 పోస్టులు, ప్రిన్సిపల్ 52 పోస్టులు, పీఈటీ 132 పోస్టులు ఉండనున్నాయి.

# పేకాట ప్రీమియర్‌లీగ్






- మూడుచోట్ల ఒకేసారి చతుర్ముఖ పారాయణం
- సిండికేట్‌గా ఏర్పడి రాష్ట్రస్థాయి పోటీగా మార్చేశారు
- అన్ని ఫ్రాంచైజీలలో గోపీ, తులసీలే యజమానులు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆడే ఆటగాళ్లను కొనుగోలు చేసే ఫ్రాంచైజీలు ఐపీఎల్ నిర్వహించి, లాభాలను సంపాదిస్తున్నట్లే ఉత్తరాంధ్ర ప్రాంతంలో పేకాడేవారిని ఒక చోట కూర్చి జిల్లా బోర్డర్‌లో మూడు ఫ్రాంచైజీలుగా నడుపుతున్న కథ ఇది. అయితే ఐపీఎల్‌లో ఒక్కో ఫ్రాంచైజీకి ఒక్కో యజమాని ఉంటాడు. షారూక్ ఖాన్ ఒక టీమ్‌ను కొనుక్కుంటే, ప్రీతిజింతా, నీతూ అంబానీ లాంటివారు వేరే ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. కానీ పేకాట ప్రీమియర్ లీగ్‌లో అన్ని ఫ్రాంచైజీలకు ఒకడే యజమాని. పేకాడించేవారందర్నీ సిండికేట్ చేసి వేర్వేరు చోట్ల.. మన క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే వేర్వేరు పిచ్‌ల మీద ఆడిస్తున్నారు. ఏ దేశం క్రికెట్ ఆడినా ఐసీసీ పరిధిలోకే వచ్చినట్లు ఇక్కడ ఏ ప్రాంతంలో పేకాట ప్రీమియర్ లీగ్ ఆడినా ఆ సిండికేట్‌కే సొమ్ములు చేరాలి. ఈ వ్యాపారంలో కాంపిటేషన్ లేకుండా మోనోపలిగా నిర్వహిస్తుండటం వెనుక ప్రతీ వ్యవస్థలో మేనేజ్ చేయడానికి పెద్ద యంత్రాంగమే పని చేస్తోంది. డబ్బులు తేవడానికి ఒక గ్రూపు, జూదరులను తరలించడానికి ఒక గ్రూపు, డబ్బును కాయిన్లుగా మార్చడానికి మరో గ్రూపు, జూదమాడేవారికి సకల సౌకర్యాలు కల్పించడానికి మరో గ్రూపు, ఏ పిచ్ మీద ఆడాలో నిర్ణయించడానికి ఒక నిఘావ్యవస్థ.. మొత్తం కలిపి ఒక పరిశ్రమనే వీరు నడుపుతున్నారు.

**డీజీపీకి లేఖ**

అవకాశం దొరికిన ప్రతిచోట పేకాట శిబిరాలను నిర్వహిస్తూ జూదరుల బలహీనతలను క్యాష్ చేసుకుంటున్న శ్రీకాకుళం నగరానికి చెందిన గరికి గోపాలకృష్ణ, బెండి తులసీ అండ్ బ్యాచ్‌పై పోలీసు ఉన్నతాధికారులకు ఒక బాధితుడు మంగళవారం పోస్టు ద్వారా ఫిర్యాదు చేశాడు. పేకాటను ఐపీఎల్ మాదిరిగా నిర్వహిస్తూ లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్నారని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. పేకాట శిబిరం నిర్వహించడానికి గోపి, తులసీ జిల్లాలో సరిహద్దుల్లోని పోలీసులకు ఇస్తున్న ప్యాకేజీని అందులో పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రంతో పాటు, ఆయా సర్కిల్స్ పరిధిలో ఉన్న పోలీసులు ఎవరెవరితో వీరికి సంబంధాలు నెరుపుతున్నారో వివరించినట్టు తెలిసింది. గోపి, తులసీ బారినపడి ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయో అందులో పేర్కొన్నట్టు తెలిసింది. గతంలోనూ ఇలాంటి ఫిర్యాదే ఒకటి డీజీపీ, ఎస్పీకి అందిన వెంటనే పేకాట నిర్వాహకులపై నిఘా పెట్టి జిల్లాలో పేకాట శిబిరాలు లేకుండా అడ్డుకొని కొందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి విడిచిపెట్టేశారు. ఆ తర్వాత వారంతా వేర్వేరు కుంపట్లు పెట్టకొని గరివిడి, భోగాపురం, ఒడిశా, నేపాల్, గోవా బాట పట్టారు. మళ్లీ వారంతా ఒక్కచోటకు చేరి జూదర్లకు సమాచారం ఇచ్చి పేకాట శిబిరాలను నిర్వహించడం ప్రారంభించారు. ఇటీవల పేకాట శిబిరాల నిర్వహణ ఒక ఉద్యమంలా సాగుతుంది. దీనికి పోలీసులు అండదండలు అందించడంతో పాటు టీడీపీ నాయకులు తమ వెంట ఉన్నారని నిర్వాహకులు బహిరంగంగా చెప్పుకు తిరుగుతున్నారు. వాస్తవంగా పేకాట నిర్వాహకులందరూ వైకాపా నాయకులతో అంటకాగుతూ జిల్లాలో రణస్థలం, నరసన్నపేట, శ్రీకాకుళం, జలుమూరు, రాజాం, సోంపేట, మందసలో ఎక్కడికక్కడే శిబిరాలను ఏర్పాటుచేసి పేకాట ఆడిస్తూ వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టీడీపీ పేరుతో పబ్బం గడుపుతున్నారు.

శ్రీకాకుళం నగరానికి చెందిన గరికి గోపాలకృష్ణ, ఆమదాలవలస మండలం తోటాడకు చెందిన బెండి తులసీ, ఆమదాలవలస మండలం అక్కివరానికి చెందిన సీపాన శ్రీను, మాజీ ఆర్మీ ఉద్యోగి తాండ్ర తేజేశ్వరరావు, నరసన్నపేటకు చెందిన గన్నీ, శ్రీకాకుళానికి చెందిన బందారీలతో పాటు నగేష్, చల్లా రాజు, అప్పి ఉన్నారు. ప్రస్తుతం గజపతి జిల్లా గారబందకు 15 కిలోమీటర్ల దూరంలో శాశ్వత పేకాట శిబిరం ఏర్పాటుచేసి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి జూదర్లను తీసుకువెళుతున్నారు. టెక్కలి, మెళియాపుట్టి, చాపర మీదుగా సుమారు ఏడు వాహనాల్లో జూదర్లను నిర్వాహకులు తరలిస్తున్నారు. అందులో మూడు వాహనాల్లో శ్రీకాకుళం కొత్తరోడ్ నుంచి బెండి తులసీ, తేజ, శ్రీను బయలుదేరుతున్నారు. కలెక్టరేట్ వద్ద బాదుర్లపేట నుంచి డిజైర్ వాహనంలో గరికి గోపాలకృష్ణ బ్యాచ్ బండారి, నగేష్ బయలు దేరుతున్నారు. ఈ వాహనంలోనే నగదుతో పాటు కాయిన్స్ తరలిస్తుంటారు. నరసన్నపేట నుంచి గన్ని (గణేశ్వరరావు) ఆధ్వర్యంలో ఒక బ్యాచ్ బయలుదేరుతుంది. వీరు ఉదయం 10 గంటలకు నగరం నుంచి బయల్దేరి గారబందకు రెండు గంటల వ్యవధిలోనే చేరుకుంటారు. అక్కడికి చేరిన తర్వాత వీరికి ఒడిశాలోని బరంపురం, పర్లాకిమిడి తదితర ప్రాంతాల నుంచి మరికొందరు తోడవుతున్నారు. వీరి ఆధ్వర్యంలో వాటాలు పెట్టి పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న రాష్ట్ర సరిహద్దుల్లోని ఒడిశా పరిధిలో గారబంద, గోచెక్క, సుంకికి జూదర్లను అద్దెవాహనాల్లో తరలించే బాధ్యతను నగరానికి చెందిన అప్పి, చల్లా రాజు చూస్తున్నట్టు తెలిసింది.

బెండి తులసికి పోలీసుల్లో కొందరితో ఉన్న బంధత్వం వల్ల వైకాపా హయాంలో బెండి తులసికి అండదండలు - మిగతా 4లో

## అన్నదానసేవలో యువత




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

బొందిలీపురంలోని ఖ్యాతి వృద్ధాశ్రమంలో బుధవారం తన జన్మదినం సందర్భంగా కోరాడ దుర్గాప్రసాద్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన జన్మదినాన నిస్సహాయ వృద్ధులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. నగరంలో ప్రతి నిత్యం ఏదో ఒక సేవలో ఉంటున్న ఉర్లం శివతేజ, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్ చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఈ రోజు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.విజయ్, బొట్టా శంకర్, కలగ రాజు, కోరాడ గౌతమ్, నవీన్ ప్రసాద్, ఖ్యాతి వృద్ధాశ్రమం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున అగ్రికం కార్మికుల ఔదార్యం



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

నాగార్జున అగ్రికం కార్మికులు, ఉద్యోగుల ఔదార్యాన్ని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్ఏసిఎల్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌పీడీ హెడ్ కె.శ్యాంప్రసాదరావు అభినందించారు. నాగార్జున అగ్రికం పరిశ్రమలో పనిచేస్తూ కార్మికుడు సుతారి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి బుధవారం ఎన్ఏసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా వసూలుచేసి ఇచ్చిన మొత్తాన్ని పరిశ్రమలో జరిగిన సమావేశంలో మృతుని భార్య సుందరమ్మ, అల్లుడు వి.రాజశేఖర్‌లకు చెక్కు రూపంలో యాజమాన్య ప్రతినిధులు సిటు, యూనియన్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఒకరోజు వేతనంతో పాటు గ్రాడ్యుటీతో కలుపుకొని రూ.12,76,052 అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, సిహెచ్ సత్యనారాయణ, జె.నూకరాజు, పి.చిన్న, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సంస్కృతి కాపాడాలి




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో జాతీయ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. కనుమరుగవుతున్న ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన తెలిపారు. సమాజానికి, నాగరిక ప్రపంచానికి దూరంగా కొండల్లో కోనల్లో జీవిస్తున్న ఆదివాసీలు వారి ఆచార వ్యవహారాలపై ప్రభుత్వాలు అధ్యయనం చేయాలని, వారి సంస్కృతిని కాపాడడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి జీవన విధానం మెరుగుపరిచే విధంగా ఉండాలని, వారికి కావలసిన మ్యూజియం, ఇన్వెస్ట్మెంట్స్ పరికరాలు ప్రభుత్వం అందజేయాలని, అడవుల్లో, కొండల్లో స్వేచ్ఛగా జీవించే ఆదివాసీల మనుగడకు ఎటువంటి ఆటంకం కల్పించకూడదని, అప్పుడే ఆదివాసీలు స్వేచ్ఛాయుతంగా తమ సంస్కృతి సంప్రదాయాలు కాపాడగలుగుతారని ఆయన తెలిపారు. ఆదివాసీల జీవన విధానం ఒక ప్రత్యేకత కలిగి ఉందని, నేడు ఆదివాసీల మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల కోసం అగ్రకులాలను ఎస్టీ జాబితా చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానం చేయడం వల్ల నిజమైన ఆదివాసీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో ఆదివాసులను మ్యూజియంలో చూడవలసిన పరిస్థితి వస్తుందని ఆవేద వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ప్రొఫెసర్స్ బి.కె.పాణిగ్రహి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఐఐటి ఢిల్లీ, ప్రొఫెసర్ ధర్మేంద్ర రౌత్ లాల్ బహుదూర్ శాస్త్రి, నేషనల్ సాన్స్క్రిట్ యూనివర్సిటీ న్యూఢిల్లీ, గంగా సహాయ్ మీనా అసిస్టెంట్ ప్రొఫెసర్ సీఐఎల్ జేఎన్‌యూ పాల్గొన్నారు.

## సర్వేలో లోపాలుంటే దరఖాస్తు చేసుకోండి



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సర్వేలో లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. బుధవారం సారవకోట మండలం అంగూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ రీసర్వేలో పొరపాట్లను సరిదిద్దుందుకే రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి భూయజమానుల నుంచి భూమిని కాజేసేందుకు పన్నాగం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, తహసీల్దార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అనునిత్యం ప్రజల మధ్యే..!

- ✔ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం చూపుతూ
- ✔ విశాఖ-ఏ కాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్ గ్రీవెన్స్





**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఎన్నికల ముందు, ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రజానాయకుడు ఎమ్మెల్యే గొండు శంకర్. నగరంలోని విశాఖ-ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే శంకర్ స్వీకరించారు. ప్రజల సమస్యలను సాదరంగా వింటూ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ సానుకూలకంగా పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని చెప్పారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున సమస్యలకు సంబంధించిన వినతులు రావడమే ఇందుకు కారణమని వివరించారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్, గ్రామాల పరిధిలో కనీసం మౌలిక సదుపాయాల కల్పనను కూడా గత ప్రభుత్వం మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తమ సమస్యలు అధికారులకు పాలకులకు విన్నవించుకుంటున్నారని, డ్వాక్రా మహిళలను, ప్రజలను, వృద్ధులను, ఇబ్బందులకు గురిచేసి సమావేశాలకు రప్పించి గేట్లు వేసి నిర్బంధించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసేదేమీ లేదని అన్నారు. జిల్లా పర్యటనకు గతంలో జగన్ వచ్చినప్పుడు నగరంలోని అన్ని రోడ్లను పోలీసులు మూసివేసారని, ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు కూడా అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించినప్పుడు ప్రజలు స్వేచ్ఛగా రోడ్లపై తిరుగుతూ తమ పనులు చేసుకున్నారని ఇది గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా అని వివరించారు. పెన్షన్లు, ఇల్లు, రోడ్లు డ్రైనేజీలు తదితర సమస్యలతో ప్రజలు నిరంతరం తనను కలుస్తున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చం నాయుడుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి శ్రీకాకుళం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.

• ఎడిటోరియల్

# 'ఉపాధి'తోనే అభివృద్ధి

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి పొందుతున్న వారి శాతం ఈ సంవత్సరం మొదటి అర్ధ భాగంలో 16.6 శాతం తగ్గింది. గత రెండేళ్లలో ఎనిమిది కోట్ల మంది 'ఉపాధి హామీ' నుంచి తొలగించబడ్డారని ఈ చట్టం అమలుపై లిబ్ టెక్ ఇండియా, ఎన్.ఆర్.ఇ.జి.ఎ సంఘర్ష్ మోర్చా చేసిన సర్వే ప్రకటించింది. దేశాన్ని అగ్రభాగన నడుపుతున్నామని, 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారుస్తానని దేశ ప్రధాని ఒకవైపు చెబుతుంటే, గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం వంద రోజుల పనిని గ్యారంటీగా కల్పించాల్సిన 'ఉపాధి హామీ' దినదిన గండం నూరేళ్ల ఆయష్షుగా మారిందని ఈ నివేదక నిర్ధారించింది. 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేసిన సర్వే 14 రాష్ట్రాల్లో గ్రామీణ ఉపాధి క్షీణించినట్లు తెలిపింది. ఈ పథకం కింద గత ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య పని చేసిన చురుకైన కార్మికుల సంఖ్య (యాక్టివ్ వర్కర్స్) ఈ సంవత్సరం అదే నెలలో 8 శాతం తగ్గింది. ఈ ఒక్క సంవత్సరమే దేశవ్యాప్తంగా 39 లక్షల మంది ఉపాధి హామీ కార్మికులు పనులు కోల్పోయారు. ఇప్పటికే వ్యవసాయ సంక్షోభంతో కునారిల్లుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఈ పరిణామంతో మరింత సంక్షోభంలో కూరుకుపోతుంది. పేదలకు పని లేకపోవడం వల్ల వారి కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ముఖ్యంగా పౌష్టికాహారం పొందలేకపోవడంతో పాటు, విద్య, వైద్యానికి దూరమవుతారు. గ్రామాల్లోని కోట్ల మంది పేదలు దారిద్ర్యపు కోరల్లో చిక్కుకుంటారు. పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలు మందగించి, పట్టణ పరిశ్రమల్లో ఉత్పత్తి తగ్గుతుంది. అందులో పని చేస్తున్న అనేక మంది ఉపాధి అవకాశాలను కోల్పోయి అప్పటికే ఉన్న పాత నిరుద్యోగులతో కలుస్తారు. ఈ విష వలయం దేశాన్ని వికసిత్ భారత్ వైపు ఎలా తీసుకుపోతుంది? దేశంలో కోట్ల మందిగా వున్న గ్రామీణ కూలీలకు ఉపాధి గ్యారంటీ కల్పించడం కోసం స్వాతంత్ర్యానంతరం వచ్చిన ఒకే ఒక్క పథకం ఎన్.ఆర్.ఇ.జి.ఎ. ఈ పథకం అమలు కావడం వల్ల పేదల కడుపులోకి నాలుగు మెతుకులు పోవడంతో పాటు ఆత్మగౌరవంతో బేరసారాల శక్తి పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 742 జిల్లాలు, 7,204 మండలాలు (లేదా బ్లాక్‌లు), 2,69,121 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం అమలవుతుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి 12 కోట్ల 88 లక్షల మంది రూ.74,274 కోట్లను కూలీ రూపంలో పొందారు. ఇందులో క్రమంగా యంత్రాల వాటా పెరిగింది. మన రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లో 661 మండలాలు, 13,285 గ్రామ పంచాయితీలు, 47,115 నివాస ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతుంది. 1,03,55,184 మంది కూలీలు ఈ చట్టం ద్వారా పనికి అర్హులు. ఉపాధి పనుల ద్వారా పొందిన వేతనాల్లో ఎక్కువ భాగం పని చేసిన గ్రామాల్లోనే రోజువారి కుటుంబ అవసరాలు, సామాజిక కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తారు. ఆ మేరకు గ్రామాల్లో డబ్బుల చెలామణి పెరిగింది. అన్నిటికంటే ముఖ్యంగా కూలీల్లో బేరమాడే శక్తి కొంత పెరిగింది. గ్రామాల్లో కొంత సామాజిక చైతన్యం పెరగడానికి ఇది తోడ్పడింది. గత పది సంవత్సరాల్లో క్రమంగా నిధులను తగ్గిస్తూ వచ్చింది. 2023 బడ్జెట్‌లో ఈ పథకానికి 33 శాతం నిధులు తగ్గించింది. బడ్జెట్‌లో కేటాయింపులకు ఆచరణలో ఖర్చు చేసే దానికి చాలా వ్యత్యాసం వుంది. డిఎంకె ఎంపీ కనిమొళి నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ ఉపాధి హామీ చట్టం పని దినాల సంఖ్యను 100 నుంచి 150 రోజులకు పెంచాలని ఈ సంవత్సరం ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీల కుటుంబాల్లో కేవలం 7.5 శాతం మందికి మాత్రమే వంద రోజుల పని దొరికింది. పని చేసిన తర్వాత నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం లాంటి అనేక పద్ధతుల ద్వారా ఉపాధి పనికి వెళ్లాలనే ఉత్సాహాన్ని కూలీలలో తగ్గించివేసింది. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి ఉపాధి చట్టం కింద పని చేసిన కూలీలకు రూ. 20,751 కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. రోజూ పని చేస్తే తప్ప పూట గడవని కూలీలకు ఆరేడు నెలలుగా బిల్లులు ఎందుకు బకాయి వుంటున్నాయి? కూలీలకు సకాలంలో డబ్బులు అందకపోతే అనివార్యంగా ఈ పని నుంచి తప్పుకుంటారు. పని దినాలు కల్పించాలనే డిమాండ్ చేయడం తగ్గిపోతుంది. తిరిగి మరలా గ్రామీణ వేతన దోపిడికి గురికావలసి వస్తుంది. రాష్ట్రంలోని నేతలకు, మీడియాకు తిరుపతి లడ్డు మీద, కుటుంబ వ్యక్తిగత ఆస్థుల మీద వున్న శ్రద్ధలో ఒకటో వంతైనా కోట్లమంది వ్యవసాయ కూలీల మీద పెట్టడంలేదు. మా దేశంలో, రాష్ట్రంలో అన్నీ రాయితీలు ఇస్తాం పరిశ్రమలు పెట్టండి మహాప్రభో అని దేశ ప్రధాని నుండి రాష్ట్ర మంత్రుల వరకు దేశదేశాలు తిరుగుతున్నా పరిశ్రమలు ఎందుకు రావడంలేదు? ప్రజల కొనుగోలు శక్తి వుంటే ఎవరూ అడక్కపోయినా పెట్టుబడిదారులు వస్తారు, పరిశ్రమలు పెడతారు. కొనుగోలు శక్తి పెరగాలంటే గ్రామాల్లో ఉపాధి, పట్టణాల్లో ఉద్యోగాలు కల్పించాలి.



అధికారమే పరమావధిగా చెలరేగిపోయేవారు కొందరైతే, దాన్నొక మణిగా ధరించి వెలుగులు పంచే అధికారులు మరికొందరు. ఆ కోవకు చెందిన మణి కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే తత్త్వం. లేకపోతే ఎంతమంది కలెక్టర్ స్థాయిలో ఉండి తమ పిల్లల్ని అంగన్వాడీకి పంపిస్తారు? పమేలా సత్పతికే అది సాధ్యం.

# శతమానం భవతి.. ఈ సత్పతి!

శుక్రవారం మాది..

ముందు మా సేవలు చూడండి

Courtesy: Sakshi

మహిళ పరిపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా 'శుక్రవారం సభ'

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న కార్యక్రమం

పిల్లల మానసిక వికాసానికి అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టి

నేటి కాలంలో ఆడపిల్ల కడుపున పడినప్పటి నుంచీ కష్టాలే. ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్లు చేయించుకోవడం నుంచి కిశోర బాలికలకు, బాలింతలకు పోషకాహారం అందకపోవడం దాకా ఎన్నో సమస్యలు. మహిళలు కేన్సర్లు సహా ఎన్నో శారీరక రుగ్మతలకు లోనైనా కప్పిపుచ్చుకుంటూ జీవిస్తున్న పరిస్థితి. పిల్లలను అంగన్‌వాడీలకు పంపడం లేదు. తెలియక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించేలా, మహిళల్లో అవగాహన కల్పించేలా కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, స్వయం సహాయక సంఘాలను ఒకే తాటిపై తీసుకువచ్చారు. 'శుక్రవారం సభ'పేరిట ప్రభుత్వ సేవలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్



చిన్నారికి ఉగ్గుఅన్నం తినిపిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నేటి కాలంలో మహిళలు కూడా ఏదో ఒక పనిచేస్తున్నారు. పిల్లలను ప్రైవేటు బడులకు పంపుతున్నారు. అనారోగ్యమొస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఈ క్రమంలో 'ప్రభుత్వ పథకాలను ఆసరాగా చేసుకుని ఎదగండి. చిన్నారులకు అంగన్‌వాడీలలో అందించే బాలామృతం, కిశోర బాలికలకు రక్తహీనతను తగ్గించే పోషకాహారం, బాలింతలకు బలవర్ధకమైన ఆహారం, మధ్య వయసు స్త్రీలకు ప్రతీ 3 నెలలకోసారి ప్రభుత్వ ఆస్పత్రిలో 'ఆరోగ్య మహిళ' పేరిట లభించే 52 ఉచిత పరీక్షల వివరాలు తెలుసుకోండి. ఈ సేవలన్నీ ప్రభుత్వం వద్ద ఉచితంగా అందుతాయి..'అంటూ 'శుక్రవారం సభ'పేరిట వారానికి ఒక మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అక్కడే గర్భవతులకు సీమంతం, బాలింతలకు పోషకాహార పంపిణీ వంటివాటిని కలెక్టర్ స్వయంగా చేపడుతుండటం గమనార్హం.





ఒడిశాకు చెందిన పమేలా ఇంజినీరింగ్ చదువుకుని కొన్నాళ్లు సాఫ్ట్వేర్ ఉద్యోగం కూడా చేశారు. కాబట్టే మహిళల సమస్యలపై అవగాహన ఉంది. అందుకే పరిష్కారానికి కొత్తగా ఆలోచన చేశారు. ముందుగా మహిళల కోసం ఉన్న పథకాలు, అమలు చేయడానికి ఉన్న వ్యవస్థలను ఒకతాటి పైకి తెచ్చారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాలను సమన్వయపరచి కరీంనగర్ జిల్లా మహిళల, పిల్లల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టారు. చక్కటి ఫలితాలూ సాధిస్తున్నారు.

అసలు మహిళలకు ఏం కావాలి? నిరంతరం కుటుంబం కోసం ఆరాటపడే ఆమె ఆరోగ్యం గురించి ఆలోచించేదెవరు? ప్రసవ సమయంలో, చంటి పిల్లల పోషణకు సంబంధించి, మధ్య వయసులో అనేక ఆరోగ్య సమస్యలకు గురయ్యే మహిళలకు తమకోసం ఎన్నో ప్రభుత్వ పథకాలున్నాయని, వాటిని ఉపయోగించుకోవచ్చని తెలీదు. దురదృష్టంకొద్దీ రాజకీయ నాయకులు ఓట్ల మీద పెట్టే శ్రద్ధ ఈ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో పెట్టరు. దాంతో చాలామంది అనారోగ్యమొస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆస్తులమ్ముకుంటున్నారు. నిజానికి ఎంతమందికి అంగన్వాడీల్లో చిన్నారులకందించే బాలామృతం, యుక్త వయసు బాలికల్లో రక్తహీనత నివారించే ఆహార, గర్భిణులకు పోషకాహారం గురించి తెలుసు? ఇది కాక మూడు నెలలకోసారి ప్రభుత్వాసుపత్రిలో 52 రకాల ఉచిత వైద్య పరీక్షలు చేయించుకునే 'ఆరోగ్య మహిళ' పథకం ఉంది. ఇవన్నీ



వివరించడానికే పమేలా సత్పతి 'శుక్రవారం సభ' ప్రారంభించారు. వారానికి ఒక మండలంలో ఈ సభ నిర్వహిస్తారు. అక్కడ పథకాల గురించి వివరించడమే కాదు.. గర్భవతులకు సీమంతం వేడుకలూ నిర్వహిస్తారు. బాలింతలకు పోషకాహారం అందిస్తారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ స్వయంగా పాల్గొంటారు. అంగన్వాడీలను ఆహ్లాద భరితంగా తీర్చిదిద్దుతున్నారు. ఫలితంగా మహిళల్లో చైతన్యం కనిపిస్తోంది. కలెక్టర్ సత్పతి పట్ల అభిమానం పెరుగుతోంది. శతమానం భవతి అని సత్పతిని దీవించేలా చేస్తోంది. ఇటువంటి అధికారులు నిజమైన మార్గదర్శకులు. మనకి కావలసింది వీరే.

–కె. శోభ

పీసీవోడీ, కేన్సర్, భ్రూణహత్యలపైనా..

నడి వయసు మహిళలకు ఆరోగ్య మహిళా పథకం ద్వారా పీసీవోడీ (గర్భాశయంలో కణతులు), కేన్సర్ నిర్ధారిత పరీక్షలు నిర్వహిస్తారు. వాటి ముప్పును ముందుగా గుర్తించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని.. అవే పరీక్షలు, చికిత్సలు ప్రైవేటులో చేస్తే రూ.లక్షల ఖర్చు అవుతుందని, ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందని కలెక్టర్ సత్పతి మహిళలకు భరోసా కల్పిస్తున్నారు. మహిళలు తీవ్ర అనారోగ్యాల పాలైతే వారి కుటుంబాలు ఆగమవుతాయని సూచిస్తున్నారు. పిల్లల మానసిక వికాసానికి వీలుగా అంగన్‌వాడీలను ఆహ్లాద వాతావరణం ఉండేలా మారుస్తున్నారు. భ్రూణహత్యలను అరికట్టేలా మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

Courtesy: Sakshi

పోషకాహారం ప్రాధాన్యం తెలిసింది..

కలెక్టర్ సత్పతి మేడం మొదలుపెట్టిన శుక్రవారం సభ మాలో చైతన్యం తెచ్చింది. బాలింతలకు, గర్భవతుల సంక్షేమం కోసం మొదలు పెట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. మాలో రక్తహీనత నివారించేలా అవగాహన కల్పించారు. తల్లి పాల ప్రాముఖ్యత, అంగన్‌వాడీలలో లభించే సేవల గురించి చక్కగా వివరించారు.

–అనిత, గృహిణి, వెంకట్రావుపల్లి, హుజూరాబాద్



కేన్సర్ ముప్పు గురించి చెప్పారు

కలెక్టర్ మేడం పీసీవోడీ, కేన్సర్ ఎలా వస్తాయో వివరించారు. మా ముందు తరాల వారు పనిలో పడి ఎలాంటి పరీక్షలు చేయించుకోకుండా ప్రాణాలు పోగొట్టుకున్నారు. కలెక్టర్ మేడం తల్లిలా మాపై శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆడపిల్లల ప్రాధాన్యం వివరించి భ్రూణహత్యల నివారణపైనా అవగాహన కల్పించారు.



– అఖిల, గృహిణి, వెంకట్రావుపల్లి, హుజూరాబాద్

# కంగువా X పుష్ప.. ఈ విషయంలో అప్పర్ హ్యాండ్ ఎవరిది?







సౌత్ ఇండియన్ సినిమా అభిమానులకు ఈ ఏడాది చివరలో ప్రత్యేకంగా నిలిచేలా రెండు భారీ చిత్రాలు 'కంగువా', 'పుష్ప–2' విడుదలకు సిద్ధమవుతున్నాయి. సూర్య ప్రధానపాత్రలో శివ దర్శకత్వం వహించిన 'కంగువా' నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలకాబోతోంది. ఈ చిత్రానికి నిర్మాత ధనుంజయ్ 10,000 స్క్రీన్‌లలో రిలీజ్ చేస్తామని ప్రకటించి అందరి దృష్టిని ఆకర్షించారు. సూర్య ఈ సినిమాలో ఆరు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని, యాక్షన్‌తో పాటు ఎమోషన్‌ను సమర్థంగా ప్రదర్శించేలా చిత్రాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. ఇదే సమయంలో, సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప: ది రూల్' మరో భారీస్థాయి చిత్రంగా 11,500 స్క్రీన్‌లలో విడుదలకు సిద్ధంగా ఉంది. మొదటి భాగం 'పుష్ప: ది రైజ్' సూపర్‌హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇండియాలో 6,500 స్క్రీన్‌లలో అలాగే ఓవర్సీస్‌లో 5,000 స్క్రీన్‌లలో విడుదల చేయబోతున్న ఈ సినిమా, అల్లు అర్జున్‌ను పాన్‌ఇండియా స్టార్‌గా మరింత పాపులారిటీని అందిస్తుందని నిర్మాతలు ఆశాభావంతో ఉన్నారు.

ఈ రెండు చిత్రాల యొక్క స్క్రీన్ లెక్కలు పరిశీలిస్తే 'పుష్ప 2'కే మరింతగా స్క్రీన్‌లలో రిలీజ్ అవుతున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయంలో అప్పర్ హ్యాండ్ పుష్పకే ఉన్నట్లు అనిపిస్తోంది. కానీ సూర్యకు సౌత్ ఇండియాలో ఉన్న పాపులారిటీ, అభిమానుల అంచనాలు కూడా 'కంగువా' చిత్రం పై భారీగా ఉన్నాయి. కాబట్టి రెండు చిత్రాలు కూడా వసూళ్ళ పరంగా పోటాపోటీగా నిలుస్తాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రెండు చిత్రాల నిర్మాతలు కూడా ఎటువంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉండేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో సినిమాలకు హైప్ క్రియేట్ చేయడంలో సూర్య, అల్లు అర్జున్ టెక్నికల్ టీమ్ కూడా శక్తివంచన లేకుండా పని చేస్తోంది. 1000 కోట్ల బాక్సాఫీస్ టార్గెట్ పెట్టుకొని రెండు చిత్రాలు కూడా దూసుకుపోతున్నాయి. ఇక ప్రేక్షకులకు ఈ రెండు భారీ చిత్రాలు పండుగను తలపించనుండగా, ఏ చిత్రం ఎక్కువ కలెక్షన్లు సాధిస్తుందో చూడాలి.

– ఫిల్మీఫోకస్.కామ్ సౌజన్యంతో...

# యోగ భంగిమలతో మతి చెడగొడుతోంది!

కార్తీక్ ఆర్యన్ లీడ్ రోల్ పోషించిన 'సోను కే టిటు కి స్వీటీ'లో యంగ్ బ్యూటీ సాక్షిమాలిక్ స్పెషల్ ట్రీట్‌కి ఫిదా కాని వారు లేరు. 'బోమ్ డిగ్గీ డిగ్గీ...' పాటలో సాక్షి కవ్వింతకు ఫిదా అయిపోయారంతా. అటుపై అర్మాన్ మాలిక్ 'వెహం' మ్యూజిక్ వీడియోలో నటించింది. సాక్షి సోషల్ మీడియాల్లోను ఇతర భామలకు ధీటుగా చాలా స్పీడ్ గా ఉంది. ముఖ్యంగా ఇన్‌స్టాలో ఈ భామ షేర్ చేసే ఫోటోషూట్లు వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా సాక్షి యోగాభ్యాసానికి సంబంధించిన ఫోటోగ్రాఫ్స్‌ని ఇంటర్నెట్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలలో రకరకాల భంగిమల్లో సాక్షి ఇచ్చిన ట్రీట్ యువతరం హృదయాలను దోచుకుంది. పింక్ కలర్ డిజైనర్ ఫ్రాకులో సాక్షి ఎంతో అందంగా కనిపించింది. పరిశ్రమకు రాక మునుపు టాప్ మోడల్ గా రాణించిన సాక్షి మాలిక్ టీవీ కమర్షియల్స్‌తో ఆడియెన్‌కి చేరువైంది. మారుతి ఆటో ఎక్స్ పో–2020 వేదికపై బ్రాండ్ అంబాసిడర్‌గా హృదయాలను దోచుకుంది. ఆటో ఎక్స్ పో 2020 వేదికకే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తర్వాత సాక్షి సినీ రంగంపై దృష్టి సారించింది. పరిశ్రమలో టాప్ హీరోయిన్‌గా వెలిగిపోవాలని కలలు గంటోంది. ప్రస్తుతం ఇన్‌స్టా వేదికగా వరుస ఫోటోషూట్లు షేర్ చేస్తున్న సాక్షి యూట్యూబ్ చానెల్లో ఫిట్నెస్ క్లాసులతో అభిమానులను అలరిస్తోంది. స్వగతం ఇదీ.. సాక్షి మాలిక్ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించింది. నోయిడాలోని జేపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని పూర్తి చేసింది. కళాశాల సమయంలో ఆమె ఫ్యాషన్ షోలలో పాల్గొన్నది. గ్రాడ్యుయేషన్ తర్వాత, సాక్షి మాలిక్ ముంబైకి వెళ్ళింది. నైకా, పిసి జ్యువెలర్‌తో సహా బ్రాండ్‌ల టెలివిజన్ వాణిజ్య ప్రకటనల కోసం మోడలింగ్ చేయడం ప్రారంభించింది. 2018లో సోను కే టిటు కి స్వీటీ చిత్రంలో నటించడం ద్వారా ఆమె బాలీవుడ్‌లో అడుగుపెట్టింది.

ఆమె ఫోటో 2020 తెలుగు సినిమా 'వి'(నాని–ఇంద్రగంటి–సుధీర్ బాబు) లో కమర్షియల్ సెక్స్ వర్కర్‌గా ఉపయోగించుకున్నారు. దీనికి అభ్యంతరం చెబుతూ సాక్షి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. మార్చి 2021లో హైకోర్టు అమెజాన్ ప్రైమ్‌ను ఆ సినిమాను తీసివేయమని ఆదేశించింది. ఎందుకంటే ఆమె ఫోటోను సమ్మతి లేకుండా ఉపయోగించడం ప్రాథమికంగా అనుమతించబడదు.. పూర్తిగా చట్టవిరుద్ధం. అటుపై వి సినిమాని ఓటీటీ నుండి తీసివేసారు. ఇక నిర్మాతలు, నటులు వారి వివాదాలను ఒక నెల తర్వాత పరిష్కరించారు. 2023లో సాక్షి ములాఖత్ అనే సిరీస్‌లో నటించింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



# లావణ్య త్రిపాఠి.. సతీ లీలావతి!



వరుణ్‌తేజ్‌తో పెళ్లయ్యాక సినిమాలు చేయలేదు లావణ్య త్రిపాఠి. కొన్ని వెబ్ సిరీస్‌లలో కనిపించింది కానీ, అవన్నీ పెళ్లికి ముందు ఒప్పుకొన్న ప్రాజెక్టులు. ఇప్పుడు.. కొంత విరామం తరవాత ఓ సినిమాపై సంతకం చేసింది లావణ్య. ఈ చిత్రానికి "సతీ లీలావతి" అనే టైటిల్ రిజిస్టర్ చేయించినట్టు సమాచారం. ఇదో లేడీ ఓరియెంటెడ్ సినిమా. కథానాయిక పాత్రకు చాలా ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. ఓ యువహీరో ఈ చిత్రంలో నటించబోతున్నాడు. అతనెవరు? ఇతర వివరాలేంటి? అనే సంగతులు త్వరలో తెలుస్తాయి. కథానాయికగా మంచి ఫామ్‌లో ఉండగానే, వరుణ్‌తో పెళ్లి చేసుకొంది లావణ్య. పెళ్లయ్యాక సినిమాలకు దూరంగా ఉంటుందనుకొన్నారు. కానీ.. తను కెమెరాకు దూరం కాలేదు. ఈమధ్య లావణ్య దగ్గరకు చాలా కథలు వెళ్లాయి. కానీ అవేం లావణ్యను పెద్దగా కదిలించలేదు. 'సతీ లీలావతి' కథ నచ్చడంతో ఈ ప్రాజెక్టు ఓకే చేసేసింది. సతీ లీలావతి అనగానే కమల్ హాసన్ ఆల్ టైమ్ హిట్ సినిమా గుర్తొస్తుంది. అది వినోదాత్మకంగా సాగే కథ. ఈ రెండు సినిమాల కథలకూ ఎలాంటి సంబంధం లేదు. కేవలం టైటిల్ మాత్రమే వాడుకొన్నారంతే. అయితే ఈసారి.. భార్యాభర్తల అనుబంధాన్ని కొత్త కోణంలో చూపించబోతున్నట్టు తెలుస్తోంది.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

**నిన్న దాశరథి వర్ధంతి సందర్భంగా**

# సాహిత్య భగీరథుడు

**ఇట వసంతము లేదు.. సహింపరాని గ్రీష్మ హేమంత కాల కాళికలే గాని ఇట ఉషస్సులు లేవు.. భరింపరాని అంబువాహ సందోహ నిసాని కాని.. వెన్నెలలు లేవు.. పున్నమ కన్నె లేదు.. పైడివెన్నెల నెలవంక జాడ లేదు.. చుక్కలే లేవు.. ఆకాశ శోకవీధి ధూమదామమ్ము, దుఃఖ సంగ్రామ భూమి**

ఈ కవితలో వసంతం ప్రస్తావన తెచ్చినా ఆయన శోక సంద్రుడే గానీ, ఈయన శోకం తనకోసం కాదు. ప్రేయసి రాలేదని, తనకు దక్కలేదనీ కాదు. తాను పుట్టిన గడ్డలో దొరల దౌర్జన్యానికి, నిజాం ముష్కరమూకతో పీడింప బడుతున్న సోదరుల్లాంటి తన జనం కోసమే.

భావకవిత్వం నుంచి అభ్యుదయ కవిత్వానికి మళ్లిన దాశరథి భావకవిలా ప్రియురాలిని సృష్టించుకొని గాలిలో ప్రణయ సౌదాలను నిర్మించుకునే సమయం కాదంటాడు. అగ్నిగుండంగా మారిన తెలంగాణలో విప్లవాన్ని రగిల్చి పోరాట యోధుల్ని తయారుచేసే కాలమది. పోరు తెలంగాణ కోసం ఉద్యమిం చాల్సిన సమయమది. అభ్యుదయ భావ వీచికలతో, అక్షరాలతో అగ్గి పుట్టించాల్సిన సమయం. కవిగా దాశరథి ఆ పనే చేశారు. జనం మనం.. మనం జనం అనే నినాదాన్ని మొదటిగా తెలుగు నేలకు పరిచయం చేసినది దాశరథే. ఉలితో పాషాణంలో పీయూషాన్ని చిప్పిలజేసే శిల్పిలాంటి వారు కావాలి కవి.. అంటారు దాశరథి. ఎందుకంటే ఆయన కూడా అలాంటివాడు కాబట్టే.

**అరిశిరస్సుల నుత్తరించిన / అలుగునేనే తెలుగు నేనే అఖిల జగములు చుట్టివచ్చే / పులుగు నేనే, తెలుగునేనే తెలుగు నేనే, వెలుగునేనే...** అని విశ్వరూపాన్ని ప్రదర్శించిన మహాకవి దాశరథి. ఆయన మహాంధ్రోదయం తెలుగు ఊరులు, తెలుగు వారలు ప్రతిఫలించే కావ్యం. దాశరథికి కావలసింది మహాంధ్రోర్వర. అందుకే తూరుపు దారికెదురుగా ఉన్న ద్వారబంధాన్ని, మనిషి మనస్సుదారుల రాగబంధంగా వీక్షించాడు. మూడు కోటుల నొక్కడే ముడి బిగించి, మహాంధ్ర సౌభాగ్య గీతాన్ని ముక్త కంఠంతో ఆలపించి అఖిలాంధ్ర ప్రజల హృదయ తంత్రులను మీటిన మేటికవి దాశరథి కృష్ణమాచార్యులు.

దాశరథి 1927 సెప్టెంబరులో వరంగల్లులోని మానుకోట తాలూకా గూడూరు గ్రామంలో జన్మించారు. దాశరథి పుట్టుకతోనే అగ్నిశిఖ లాంటి ప్రతిభా మూర్తి. చిన్నతనంలోనే కవితా వ్యవసాయం చేపట్టాడు. ఆ రోజుల్లో కవిసమ్మేళనాల్లో ఈ కవి గొంతెత్తి కవితా గానం చేస్తుంటే ఎవరీ కుర్రకవి, అంటూ అందరూ ఆశ్చర్యపోయేవారట. ఆయన జీవితాన్ని ఒక మహా కవితా యజ్ఞంగా భావించారు. అందుకే దాశరథి ఒక మహాకవిగా, ప్రజాకవిగా, ఉద్యమోపజీవిగా జనం గుండెల్లో నిలిచిపోయారు. చెట్టుకి ఆకులు వచ్చినట్లుగా కవికి కవిత్వం రావాలని లేని కవితావేశాన్ని బలవంతాన తెచ్చి పెట్టుకోకూడదు. కవిత్వంగా సహజంగా రావాలి అన్నంత సహజమైనది దాశరథి కవిత్వం. అందుకు మచ్చుతునక ఈ పద్యం.

**"నేనురా తెలంగాణ నిగళాలు తెగగొట్టి / ఆకాశమంత యెత్తార్చినాను / నేను రాక్షసి గుండె నీరుగా, పద్యాలు / పాడి మానవుని కాపాడినాను / నేను వేస్తంభాల నీడలో నొకతెల్గు / తోట నాటి సుమాలు దూసినాను / నేను పోతన కవీశాను గంటములోని / ఒడుపుల కొన్నింటి బడసినాను / కోటి తమ్ములకడ రెండుకోట్ల తెలుగు / టన్నలను గూర్చి వృత్తాంత మందజేసి / మూడు కోటుల నొక్కటేముడి బిగించి / పాడి నాను మహాంధ్ర సౌభాగ్యగీతి"** కొదమ సింహం గర్జించినట్లుగా ఉన్న ఈ పద్యాన్ని చూస్తే మహాకవి కలం ఏమిటో సాక్షాత్కరిస్తుంది. మాతృభూమిని, మాతృ భాషలను మెన్నతంగా భావించి పులకించిన వైనం దాశరథిలో కనిపిస్తుంది. మహాంధ్రోదయంలోని తెలంగాణ అనే మొదటి ఖండికలో మాతృభూమిని వేనోళ్ల ప్రశంసిస్తాడు.

**కోటి తెలుగుల బంగారు కొండ క్రింద / పరుచుకొన్నట్టి సరసులోపల వసించి / ప్రొద్దు ప్రొద్దున అందాల పూలు పూయు / నా తెలంగాణ తల్లి కంజాత తల్లి** అని అనడంలో **"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ"** అనే ఆర్యోక్తి అభివ్యక్తీకరించబడింది. తనను కని, పెంచి, పెద్దచేసి మెజ్వల జీవితాన్ని ప్రసాదించిన తెలంగాణ తల్లిని కంజాత తల్లిగా కొనియాడి తన కృతజ్ఞతను చాటుకున్నాడు. ఆధునిక ప్రపంచంలో ఏ దేశంలో నైనా వర్గసంఘర్షణ, ప్రచ్ఛన్న యుద్ధాలు కనబడుతూనే ఉన్నాయి. శాస్త్ర విజ్ఞానం చంద్రమండలానికి దారితీసినా, మారణెమానికి కూడా వినియోగించబడుతుంది. విజ్ఞానం రాజకీయ స్వార్ధశక్తుల చేతుల్లో కీలుబొమ్మ అవుతుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని సిద్ధాంతాలు వచ్చినా, ఆర్థిక అసమానతలు పొడచూపుతూనే ఉన్నాయి. తత్ఫలితంగా ప్రపంచశాంతికీ, మానవత్వానికీ స్థానం ప్రశ్నార్థకమవుతుంది. మనిషి కోసమే ఈ ప్రపంచం అనేవాళ్లు సైతం మానవతావాదాన్ని పెడదోవ పట్టిస్తున్నారు. భారతీయులు ప్రజాస్వామ్యవాదులు, ప్రపంచ శాంతి కాముకులు. **'ఏనాడెవ్వడూ కత్తితో గెలువలేదీ విశ్వమున్, ప్రేమ పాశానన్ కట్టుము నాలుగుంబది ప్రపంచాలన్'** అంటూ శాంతి లేకపోతే మానవజాతికి మనుగడే లేదు అనే సత్యాన్ని గుర్తించి, లోకమంతా శాంతిపథంలో నడవాలని ఆశించి క్రాంతి కలాన్ని, శాంతి ఖడ్గాన్ని చేతపట్టి కవన, కదన రంగాలలో స్వైరవిహారం చేసిన మానవతా మూర్తి దాశరథి. శాంతి ప్రభోదాత్మకమైన కవితా ప్రపంచంలో దాశరథి **'కపోతసందేశం'** అగ్రశ్రేణికి చెందిన కావ్యం. ఇందులో హింసను, దానవాంశను నిరసించి, శాంతిని, మానవత్వాన్ని నెలకొల్పే శాంతి సందేశాన్ని కపోతం ద్వారా లోకానికి అందిస్తాడు. శాంతి కోసం ఇతను చెందిన ఆవేదన అంతులేనిది. కనీసం కావ్యాల్లోనైనా శాంతిని బతికించాలని రచయితలకు సందేశాన్ని ఇచ్చిన దాశరథి శాంతి ప్రియత్వం ఎంతో మహత్తరమైనది.

గౌతమ బుద్ధుడు, క్రీస్తు, గాంధీ మహాత్ముడు.. ఈ ముగ్గురూ అహింసామూర్తులు, శాంతి దూతలు. వీరి జీవితాలు లోకకళ్యాణానికి, విశ్వసౌభాగ్యానికి అంకితం చేయబడ్డాయి. ఈ ముగ్గురిని ఆదర్శంగా గ్రహించి దాశరథి తన వ్యక్తిత్వంతో పాటుగా, కవిత్వాన్ని కూడా

**అరిశిరస్సుల నుత్తరించిన / అలుగునేనే తెలుగు నేనే అఖిల జగములు చుట్టివచ్చే / పులుగు నేనే, తెలుగునేనే తెలుగు నేనే, వెలుగునేనే...**



పునీతం చేసాడు. బుద్ధుని వారసునిగా గాంధీజీని అభివర్ణిస్తాడు. **'అంటరానివారలమని అలమటించు / పంచముల హరిజనులని పాంచజన్య / మూది పలికిన హరిజనాభ్యుదయవాది / గాంధి మహనీయుడే లోకబాంధవుడు'** అని గాంధీ సుగుణాన్ని వర్ణించాడు. ముకిళిత పద్మాలను వికసింపచేసి లోకానికి వెలుగులు పంచే లోకబాంధవుడు సూర్యుడు. అలాగే గాంధీ మహాత్ముడు కూడా ముడుచుకుపోయిన మానవ హృదయ పద్మాలను వికసింపచేసి, విజ్ఞాన వెలుగులు పంచాడనే భావాన్ని వ్యక్తపరిచాడు. ఈ గాంధేయవాది విప్లవాన్ని హింసతో కంటే ప్రేమతోను, త్యాగంతోను సాధించ వచ్చునని నమ్ముతాడు. నీగ్రోపై **'నల్లనివాడ జ్ఞాన నయనమ్ములవాడ'** అంటూ పోతన శైలిలో పద్యం చెప్పిన నవనీత హృదయుడు మన దాశరథి. ఇతనికి యుద్ధాలూ, మతోన్మాదాలు, మారణెమాలే గిట్టవు. అణ్వస్త్రపు గ్రీష్మానికి ప్రతీ పద్యం ఒక మబ్బుపింజ కావాలని ఇతని ఆకాంక్ష. అంతః కలహాలు పనికిరావు, అంతరంగ బంధాలు, అనురాగ రాగాలు కావాలి అని ఐక్యతా సంగీతాన్ని వినిపిస్తాడు. పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, నవమి, తిమిరంతో సమరం, ఆలోచనాలోచనాలు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, గాలిబ్ గీతాలు, మొదలైన రచనలు చేసి ఎన్నో సన్మానాలు, జాతీయ స్థాయి అవార్డులతో సత్కరింపబడి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిపీఠాన్ని అలంకరించాడు. **'నా జీవితమే నా పోరాటం, ఎన్నో ప్రతీప శక్తులతో పోరాడాను, పోరాడగలను, నేను ఆశావాదిని. దురాశావాదులు నిరాశపడతారు. ఆశావాదికి నిరాశ లేదు. నమ్రతతో నా దారిన నేను పయనిస్తాను. నా గమ్యం ప్రపంచ శాంతి, నా ధ్యేయం ప్రజాస్వామ్య సామ్యవాదం. జనం మనం మనం జనం, జనం లేక మనం లేము'** అని నుడివిన దాశరథి జనం తానుగా తాను జనంగా బతికిన మానవతావాది, శాంతి కాముకుడు. ఆయన తెలుగువారి గుండెల్లో నిలిచిన 'కళాప్రపూర్ణుడు', సాహిత్య భగీరథుడు.

**- సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు**

## పేకాట శిబిరాలపై దాడి.. 9 మంది అరెస్టు




**(సత్యంన్యూస్, రణస్థలం)**

జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఎస్ఐ, సిబ్బంది కలసి పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. సూరమ్మపేట సమీపంలోని పాతర్లపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి 9 మందిని పట్టుకున్నారు. సుమారు 97,830 నగదు, 9 మొబైల్స్, 5 బైక్‌లపై స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

## నిరాశ్రయులను ఆదుకుందాం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నిరాశ్రయులను ఆదుకొనేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు. కొంక్యాన శాంతమ్మ 20వ వర్ధంతి సందర్భంగా నగరంలోని గొంటివీధి, ప్రకాశ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న నైట్‌షెల్టర్లలో నిరాశ్రయులు, నిరుపేదలకు మంగళవారం రాత్రి ఆహార పదార్థాలు, పండ్లు పంపిణీ చేశారు. తన తండ్రి కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరఫున పలుమార్లు భోజన వితరణ చేశామని, ప్రభుత్వం నుంచి సహకారమందితే నిరుపేదలకు ఆకలి తీరుతుందన్నారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సంచార జాతులు, సొంత ఇళ్లు లేనివారు ఎందరో నైట్ షెల్టర్లలో చిన్న పిల్లలు, వృద్ధులతో ఉంటున్నారని, ఆహార పదార్థాలు అందక అలమటిస్తున్నారని, వీరికి రేషన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొంక్యాన ట్రస్టు సభ్యులు మంగమ్మ, సరోజ, కొంక్యాన శివశంకర్, డాక్టర్ వినీల, తేజేస్విని, గౌతమ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 7న వైటీసీలో జాబ్‌మేళా

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన సీతంపేట వైటీసీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు పీవో తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన, 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు గల విద్యార్థినీ విద్యార్థులు అర్హులన్నారు. ఈ మూడు నెలలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ, ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలతో శిక్షణ ఇస్తామని అన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు వివరాలకు 9121 999 654, 79930 11605 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## క్యాన్సర్ బాధితునికి ఎస్‌ఎస్‌ఎస్ ఆర్థికసాయం


**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పొట్నూరు రాజేశ్వరరావు..చదువులో గెలిచినా, జీవితంలో మాత్రం పోరాటం చేస్తున్నారని స్మాల్ సర్వీస్ టూ సొసైటీ (ఎస్‌ఎస్‌ఎస్) సభ్యులు కలివరపు సూర్యప్రకాష్ అన్నారు. గూనపాలెంలో నివాసముంటున్న రాజేశ్వరరావు గత కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారని, ఎమ్మెస్సీ బీఈడీ చదివి శ్రీకాకుళంలో కేశవరెడ్డి, ఆక్సఫర్డ్, శాంతి నికేతన్ వంటి పాఠశాలలో మాథ్స్ టీచర్‌గా పని చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం వైద్యానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్మాల్ సర్వీస్ టూ సొసైటీ సభ్యులు స్పందించి దాతలు, మిత్ర బృందం అందించిన సహకారంతో రూ. 30వేలు సహాయాన్ని రాజేశ్వరరావుకు ఆయన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఎంతోకొంత సాయమందించాలని, రాజేశ్వరరావు తిరిగి కోలుకొని తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీపురు రామ్మోహన్, జామి కిరణ్ కుమార్ (బాలాజీ కిరణ్), కలివరపు సూర్యప్రకాష్, ఉర్లాం శివతేజ, పొడుగు చరణ్, పొట్నూరు ఆనంత్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నవనాగదేవతలకు అభిషేకాలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



నాగపంచమి సందర్భంగా బాయమ్మతోట చినబొందిలీ పురంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన నవ నాగదేవతలకు విభిన్న ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర పుష్పార్చన, ప్రత్యేక పూజలు విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సును కోరుతూ కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం సర్పసూక్త పారాయణం చేస్తూ విశేష హోమం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త పూర్ణచంద్రదాస్, ప్రధానార్చకులు ఈవీ ప్రశాంత్ శర్మ, సందీప్, గుమ్మా నగేష్, ఫణికుమారి దంపతులు, విశ్వజయము గ్రూప్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బాలిక ప్రాణాలు కాపాడేందుకు మేము సైతం

**ముంబయి:** ముంబైలోని బీఎంసీ ఆధ్వర్యంలో నడిచే సియోన్ హాస్పిటల్‌లోని వైద్యులు తమ విధులతో పాటు మానవత్వాన్ని కూడా చూపించారు. ఒక చిన్నారి ప్రాణాలను నిలబెట్టడానికి ఒక అడుగు ముందుకేసి అలసిపోయి నెమ్మదిగా స్పందించే హృదయానికి పేస్‌మేకర్‌ను అమర్చారు. పుడుతూనే గుండె జబ్బుతో జన్మించిన 13 ఏళ్ల దహిసర్ నివాసి చండీగౌడ్ తరచుగా మూర్ఛపోతుంది. అంతేకాదు గుండె నెమ్మదిగా కొట్టుకుంటుంది కూడా.. దీంతో ఆ చిన్నారి బాలిక ప్రాణాలను కాపాడటానికి డాక్టర్స్ ముందుకొచ్చారు. పేస్‌మేకర్ అనేది కాలర్‌బోన్ దగ్గర చర్మం కింద అమర్చే ఒక చిన్న లోహ పరికరం. ఇది రెండు ఎలక్ట్రికల్ లీడ్స్ ద్వారా గుండెకు అనుసంధానించబడి ఉంటుంది. ఈ పేస్‌మేకర్‌ను అమర్చడం వలన గుండె లయ నిమిషానికి 60-100 మధ్య కొట్టుకునే విధంగా చేస్తుంది. ఇది సాధారణ విద్యుత్ ప్రేరణలను పంపుతుంది.

అయితే చండీ గౌడ్‌కు అత్యవసరంగా పేస్‌మేకర్‌ను అవసరం ఉంది. ఈ పేస్‌మేకర్ కోసం రూ.7 లక్షల ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక ఈ పేస్‌మేకర్‌ను అమర్చడానికి సుమారు లక్ష ఖర్చు అవుతుంది. దీంతో ఈ పేజ్ మేకర్‌ను ఆ బాలికకు అమర్చే ప్రక్రియ ఖర్చుగా మొత్తం రూ. 8 లక్షలు కావాల్సి ఉంది. అయితే ఈ పరికరం ప్రభుత్వ బీమా పథకాల పరిధిలోకి రాకపోవడంతో.. కార్డియాలజీ విభాగానికి చెందిన



వైద్యులు బాలిక వైద్యానికి సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మన దేశంలో ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ మెడ్‌ట్రానిక్ ఇండియా లిమిటెడ్ బాలిక చికిత్స కోసం పేస్‌మేకర్‌ను విరాళంగా అందించింది. మిగిలిన మొత్తాన్ని భర్తీ చేయడానికి మెడికోలు సహకరించారు. 2017లో చండీ గౌడ్ మొదటిసారి పేస్‌మేకర్‌ని సియోన్ హాస్పిటల్‌లో వేయించుకుంది. అయితే బాలికకు ఇంప్లాంటేషన్ సైట్‌లో ఇన్‌ఫెక్షన్ పెరిగింది. యాంటీబయాటిక్స్ సమస్య పరిష్కారం కాకపోవడంతో పరికరాన్ని మార్చాల్సి వచ్చిందని కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ ప్రతాప్ నాథని తెలిపారు. మే 2024లో మళ్లీ బాలికకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఆ బాలికకు ఉత్తరప్రదేశ్‌లోని వైద్య కేంద్రానికి తీసుకెళ్లి అక్కడ మరో పేస్‌మేకర్‌ను అమర్చారు. అయితే మళ్లీ ఒక నెలలోనే మళ్లీ ఇన్ఫెక్షన్ సోకిందని డాక్టర్ చెప్పారు. దీంతో ఇప్పుడు పేస్‌మేకర్‌ను మార్చాల్సి వచ్చిందని చెప్పారు.

























## అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దీపావళి పండగ చీకటి పారద్రోలి వెలుగులు నింపితే, ఉచిత గ్యాస్ పంపిణీతో చంద్రబాబు, కూటమి ప్రభుత్వం మహిళల్లో వెలుగులు నింపుతోందని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. తెలుపు కార్డు, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తారని, మొదటి సిలెండర్ ఈ నెల నుంచి మార్చి 31 లోపు ఎప్పుడైనా లబ్ధిదారులు తీసుకోవచ్చని తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ బుకింగ్ చేసిన రెండు రోజుల్లో ఉచిత గ్యాస్ సిలెండర్‌ను గ్యాస్ కంపినీ డెలివరీ చేస్తారని, అమౌంట్ ముందుగా గ్యాస్ కంపెనీలకు లబ్ధిదారులు చెల్లించాలని, అనంతరం రెండు రోజుల్లో వారి అకౌంట్‌కు డబ్బులు ప్రభుత్వం తరపున వేస్తారని, మళ్లీ ఉచిత గ్యాస్ సిలెండర్ ఏప్రిల్ నుంచి పంపిణీ జరుగుతుందని తెలిపారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ఉచిత గ్యాస్ అర్హత గల వినియోగదారులకు అందిస్తారని వెంకటేష్ వివరించారు. ఈకేవైసీ లేనివారికి మాత్రం ఉచిత గ్యాస్ అందదని తెలుపుతూ, వైకాపా అబద్ధపు మాటలు ఎవరు నమ్మవద్దని హితవుపలికారు.

## లోకేష్‌కు సహచర మంత్రుల అభినందన



(సత్యంన్యూస్, అమరావతి)

అమెరికాలో వారం రోజులపాటు పెట్టుబడుల జైత్రయాత్రను విజయవంతంగా పూర్తిచేసి అమరావతి విచ్చేసిన మంత్రి లోకేష్‌ను సహచర మంత్రులు ఉండవల్లి నివాసంలో కలిసి అభినందించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడానికి లోకేష్ పడుతున్న కష్టం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన ప్రయత్నాలు రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలబెట్టడంలో గేమ్ చేంజర్ కాగలవని వారు కొనియాడారు.


## అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300, 98487 96626





రాష్ట్ర ప్రభుత్వం వెలుగు సంస్థలో పనిచేసే వీవోఏలకు 7 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ కొత్తూరు మండల మహిళా సమైక్య కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. నిరసనలో యానిమేటర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శిలు సతివాడ బాలామణి, గొర్లె శ్రీనివాసరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, యానిమేటర్ల యూనియన్ నాయకులు బిల్లింగి బెనర్జీ, పి.చిన్నమ్ముడు, జి.ధనలక్ష్మి, డి. జయంతి, డి.మణికుమారి, చందు, సుమ, శ్రావణి, స్వాతి పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, కొత్తూరు

## ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బోధన తప్ప మిగిలిన అన్ని పనులపై ఉపాధ్యాయులకు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని, తక్షణమే రాష్ట్రంలో జరుగుతున్న అన్ని శిక్షణలు వాయిదా వేసి, తదుపరి శిక్షణా కేంద్రాల సంఖ్యను పెంచి, నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్వీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పశ్చిమగోదావరి జిల్లా ఆరిగిపల్లిలో జరుగుతున్న లీడర్షిప్ ట్రైనింగ్‌లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట రత్న కుమార్ గుండెపోటుతో మరణించారని, ఉపాధ్యాయులపై ఆరు రోజులు పైగా ప్రభుత్వం చేస్తున్న తీవ్రమైన మానసిక ఒత్తిడి మూలంగా ఈ సంఘటన జరిగిందని వారన్నారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు అపార్ నమోదు, టెన్త్ పరీక్షల నామినల్ రోల్స్ ఫీజు చెల్లింపు తదితర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారని, ఒకవైపు అపార్ నమోదు, ఆధార్ మిస్ మ్యాచ్ వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు, మరోవైపు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్-2 పరీక్షలు, మరోవైపు ఎఫ్.ఎల్.ఎన్. ట్రైనింగులు, లీడర్షిప్ ట్రైనింగులు, ఈ నెల 14 మెగా పేరెంట్స్ మీటింగ్ ఇలా ఒకదాని వెంట ఒకటి ఉపాధ్యాయుల మీద స్వారీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు జిల్లాలకు ఒక కేంద్రం ఏర్పాటు చేయడం, అది కూడా రెసిడెన్షియల్ విధానంలో చేయడం వల్ల అనేకమంది ఉపాధ్యాయులు, వయస్సు పైబడినవారు, మహిళలు, గర్భవతులు, పాలిచ్చే తల్లులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్రంలో జరుగుతున్న అన్ని శిక్షణలను వాయిదా వేసి, తదుపరి శిక్షణా కేంద్రాల సంఖ్యను పెంచి, నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

# ఉత్తర కర్ణాటకలో మొదటి తల్లిపాల బ్యాంకు

(సత్యంన్యూస్, బెంగళూరు)

మన దేశంలో రోజురోజుకి పెరుగుతున్న ప్రీ మెచ్యూర్ జననాల సంఖ్య ఒక కొత్త సవాల్‌ని తీసుకువస్తోంది. 12 శాతం డెలివరీలు ప్రీ మెచ్యూర్‌గా ఉంటున్నాయి. ఫలితంగా ప్రీ-టెర్మ్ బేబీలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ఎన్నో.

చాలా మంది, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలో, ఇలా ముందుగా డెలివరీ అయిన తల్లులకు తల్లి పాలు పడకపోవటంతో పిల్లలకి తల్లి పాలు లేకపోవడం జరుగుతోంది. దానివల్ల శిశువుకి ఆ సమయంలో ఎంతో అవసరమైన తల్లిపాలతో అందే పోషకాలు అందకుండాపోతున్నాయి.

ఈ సమస్యని గమనించిన విజయపుర ప్రభుత్వ ఆసుపత్రి, సుషేనా హెల్త్ ఫౌండేషన్ డాక్టర్ సంతోష్ కర్లెట్టి సూచనతో ప్రతి సంవత్సరం 2వేల మందికి పైగా నవజాత శిశువులకు సహాయం అందించాలనే లక్ష్యంతో ఉత్తర కర్ణాటకలో మొదటి తల్లిపాల బ్యాంకును ప్రారంభించారు.

దీనివల్ల ముందుగా పుట్టిన శిశువులు ఎదుర్కొనే ఎన్నో అనారోగ్య సమస్యలకు, అలాగే పోషకాహార లోపాలకు పరిష్కారం లభిస్తోంది. దాతలు తమ పాలను అందించడం ద్వారా నియోనాటల్ మరణాల రేటును తగ్గించడం లక్ష్యంగా ఈ బ్యాంకు పనిచేస్తోంది.

ముఖ్యంగా ఆరోగ్య సమస్యల కారణంగా తల్లి పాలివ్వలేని తల్లులకు వారి శిశువులకు, ఫార్ములా మిల్క్‌తో పోలిస్తే రొమ్ము పాలు ఎన్నో రెట్లు మేలు చేస్తాయి. అనారోగ్యంతో మరణించే నవజాత శిశువుల సంఖ్యని కూడా తగ్గిస్తున్నాయి. ఈ చిన్న ప్రయత్నం పసిపిల్లల మరణాల రేటును 20 శాతం కంటే ఎక్కువగా తగ్గిస్తుందని డాక్టర్ కర్లెట్టి చెబుతున్నారు.



ఈ వినూత్న మిల్క్‌బ్యాంక్ హబ్-అండ్-స్పోక్ మోడల్‌లో భాగంగా బీదర్, కలబురగి వంటి చుట్టుపక్కల జిల్లాలకు పాలను పంపిణీ చేస్తుంది. మొదట్లో నెలకు 45-50 లీటర్ల పాలను లక్ష్యంగా పెట్టుకోగా, మొదటి సంవత్సరంలోనే 150 లీటర్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు స్పందిస్తూ ఎంతోమంది తల్లులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, తమ బిడ్డ తాగాకా కూడా మిగిలే పాలను దానం చేస్తూ మరెంత మందో పిల్లలకు ఆయువు పోస్తున్నారు.



అయితే తల్లిపాల దానం గురించి ప్రజలలో ఉండే అపోహలను తొలిగించి అందరికీ ఈ దానం పట్ల అవగాహన కలిగించటం ఈ సంకల్పంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పచ్చు. అప్పుడే ఈ పాల బ్యాంకు ఎంతోమంది తల్లులకు, పిల్లలకు సహాయపడగలుగుతుంది.

అదనపు పాలను దానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించడానికి ఈ పాలబ్యాంకు విస్తృతంగా కృషి చేస్తోంది. విరాళంగా ఇచ్చిన పాలన్నీ పాశ్చరైజ్ చేయబడి, ఆరు నెలల వరకు నిల్వ చేయబడతాయి ఈ పాలబ్యాంకులో. ఇటువంటి ప్రయత్నాలు మన దేశంలో మరిన్ని జరగాలి. తల్లిపాల ప్రాధాన్యతపై సమాజంలో అందరికి అవగాహన కల్పిస్తూ, అదనపు పాలను దానం ఇచ్చేలా ప్రోత్సహిస్తూ, అలాగే ఆ పాలను ఎంతో జాగ్రత్తగా నిల్వ చేసి అవసరమైన పసివారికి అందించటం ద్వారా నవజాతి శిశు మరణాలను గణనీయంగా తగ్గించచ్చు.

### అమెరికాలో ట్రంప్ 2.0

## అధ్యక్ష ఎన్నికల్లో జయభేరి!



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజయం లాంఛనమే. బుధవారం వెలువడుతున్న ఫలితాల్లో ప్రస్తుతం ఆయన 267 ఎలక్టోరల్ ఓట్లతో మ్యాజిక్ ఫిగర్ (270)కు మరింత చేరువయ్యారు. ఆయన విజయం ఖాయమని ఫాక్స్‌న్యూస్ ప్రొజెక్షన్‌లో పేర్కొంది. మరో మూడు ఎలక్టోరల్ ఓట్లు సాధిస్తే చాలు. ఇంకా ఐదు రాష్ట్రాల్లో ట్రంప్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆయనకు మరో 44 ఎలక్టోరల్ ఓట్లు దక్కే అవకాశం ఉంది. అధికారం చేజిక్కించుకోవడానికి కీలకమైన స్వింగ్ రాష్ట్రాల్లోని జార్జియా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా రాష్ట్రాలను సొంతం చేసుకున్నారు. దీంతోపాటు మరో నాలుగు స్వింగ్ స్టేట్స్‌లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

ట్రంప్ 267 ఎలక్టోరల్ ఓట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన జార్జియా, పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, కాన్సస్, అయోవా, మోంటానా, యుటా, నార్త్ డకోటా, వయోమింగ్, సౌత్ డకోటా, నెబ్రాస్కా, ఓక్లహోమా, టెక్సాస్, ఆర్కాన్సాస్, లూసియానా, ఇండియానా, కెంటకీ, టెన్నెసీ, మిస్సోరి, మిసిసిపి, ఒహాయో, వెస్ట్ వర్జీనియా, అలబామా, సౌత్ కరోలినా, ఫ్లోరిడా, ఐడహో రాష్ట్రాలను సొంతం చేసుకున్నారు.

మరో మూడు ఎలక్టోరల్ ఓట్లు సాధిస్తే అధ్యక్షుడిగా ట్రంప్ విజయం ఖరారైనట్లే..! అత్యంత కీలకమైన స్వింగ్ రాష్ట్రాల్లో జార్జియా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా రిపబ్లికన్ల వశమయ్యాయి. నెవడా, మిషిగన్, ఆరిజోనా, విస్కాన్సిన్‌లోనూ ట్రంప్ ముందంజలో దూసుకెళ్తున్నారు.

ఇక, అమెరికా ఎన్నికల ఫలితాల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ 224 ఎలక్టోరల్ సీట్లను కైవసం చేసుకున్నారు. కాలిఫోర్నియా, ఒరెగన్, వాషింగ్టన్, న్యూ మెక్సికో, వర్జీనియా, ఇల్లినోయీ, న్యూజెర్సీ, మేరీల్యాండ్, వెర్మాంట్, న్యూయార్క్, కనెక్టికట్, డెలవేర్, మసాచుసెట్స్, రోడ్ ఐల్యాండ్, కొలరాడో, హవాయి, న్యూహ్యాంప్‌షైర్, మిన్నెసోటా, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాను సొంతం చేసుకున్నారు.

- సత్యం ఐటీ డెస్క్

## హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట

(సత్యంన్యూస్, అమరావతి)

హీరో అల్లు అర్జున్ పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువడింది. అల్లు అర్జున్‌పై ఉన్న కేసును కోర్టు కొట్టేసింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివెయ్యాలనీ సినీ హీరో అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు నేడు తీర్పు ఇచ్చింది. అల్లు అర్జున్‌పై ఉన్న కేసును హైకోర్టు కొట్టేసింది.ఏపీ ఎన్నికల సమయంలో నంద్యాల వెళ్లిన అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీగా అభిమానులు అక్కడకు చేరుకున్నారు. అనుమతి లేకుండా భారీగా జనసమీకరణ చేశారంటూ అల్లు అర్జున్‌పై ఫిర్యాదు చేశారు. దాంతో సెక్షన్ 144, పోలీస్ యాక్టు 30 ఉల్లంఘించారని కంప్లైంట్ రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును క్వాష్ చేయాలని హైకోర్టును ఆశ్రయించారు అల్లు అర్జున్. తాజాగా అల్లు అర్జున్‌పై ఉన్న కేసును హైకోర్టు కొట్టేసింది.



## 17న శిష్టకరణాల పిక్నిక్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంప్రదాయాలను అనుసరిస్తూ ఐక్యతను చాటిచెప్పే దృక్పథంతో ఈ నెల 17న ఆదివారం పిక్నిక్ జరుగుతుందని శ్రీకాకుళం శిష్టకరణ సంఘం ఆహ్వాన కమిటీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం స్థానిక శిష్టకరణ సామాజిక భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి సర్వసభ సమావేశంలో ఈ తీర్మానాన్ని ప్రకటించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) మాట్లాడుతూ రానున్న వనభోజ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో శిష్టకరణ బంధువులంతా ఆయా పరిధిల్లో సహకరించాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వెనుక గల శిష్టకరణ సామాజిక భవనం నిర్వహించనున్నామని ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం సరైన ఆలోచన అయినప్పటికీ ఆర్థికమైన అవసరాలను పరిగణలో తీసుకుంటూ, ప్రణాళికాబద్ధంగా జయప్రదం కోసం సంఘ నాయకులంతా కృషి చేయాలన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు, గౌరవ సలహాదారు ఆరికతోట కనకరాజులు మాట్లాడుతూ మంచి ఆహ్లాదకర వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే కమిటీలు ఏర్పాటు చేసుకొని ఆయా బాధ్యతలను స్వచ్ఛందంగా స్వీకరించాలని సూచించారు. జిల్లా కోశాధికారి ఉరిటి కిరణ్ బాబు, పట్టణ సంఘం ఆర్థిక సలహాదారు ఎస్వీడీ మురళీ మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడవలసిందన్నారు. సంఘం జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ బగ్గాం శ్రీనివాస పట్నాయక్ మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకుంటూ సత్సంబంధాలు మరింతగా పెరిగే విధంగా రానున్న వనభోజనం మహోత్సవం జరగగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షులు బెహరా రామచంద్రరావు మాట్లాడుతూ విజయవంతం చేయడంలో తన వంతు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బీవీఆర్ మూర్తి, సదాశివుని వెంకటేశ్వరరావు, పెదపెంకి శ్రీరామ్ కుమార్, బలివాడ శివప్రసాద్, డబ్బీరు వెంకటరావు, లాల్, డబ్బీరు గోవిందరావు, డీవీకే పట్నాయక్, చౌదరి దివాకర్, సంఘం ప్రతినిధి కస్పా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ప్రీమియర్ లీగ్..!

(మొదటిపేజీ తరువాయి)

అందాయి. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు గోపి అండ్ బ్యాచ్‌పై బెండి తులసీ పోలీసులకు పార్టీ నాయకులతో ఫోన్ చేయించడమే ఇందుకు ఉదాహరణ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న పోలీసులను తులసి పావుగా వాడుకొని గోపితో కలిసి పేకాట శిబిరాలను నడుపుతున్నాడు. సుంకిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరానికి వీరు వెళ్లకపోయినా అక్కడ నిర్వాహకులతో వీరు వాటాదారులుగా కొనసాగుతూనే జూదర్లను అప్పి, చల్లా రాజు ద్వారా తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. గోచెక్కలో నిర్వహిస్తున్న శిబిరానికి విశాఖ నుంచి కొందరిని తులసీ బ్యాచ్ తరలిస్తూనే సీపాన శ్రీను, తాండ్ర తేజ అక్కడి వ్యవహారాలను చూస్తున్నారు.

ఒకే సమయంలో మూడుచోట్ల నిర్వహిస్తున్న పేకాట శిబిరాల్లో గారబందకు 200మందికి పైగా ఆటగాళ్లు హాజరవుతున్నారని తెలిసింది. నగదును కాయిన్స్‌గా మార్చే వ్యవహారాన్ని నగరానికి చెందిన నగేష్ చూస్తున్నాడు. దీనికోసం ఆయనకి రోజుకు రూ.3వేలు చెల్లిస్తున్నట్టు తెలిసింది. అలాగే పేకాట శిబరాలకు చల్లా రాజు ఫైనాన్స్ చేస్తున్నట్టు తెలిసింది. అప్పి అనే వ్యక్తి అద్దెకు వాహనాలు సమకూర్చడం ద్వారా ఒక వాహనానికి రూ.2వేలు కిరాయి తీసుకుంటున్నట్టు తెలిసింది. వీరంతా తులసీ, గోపిల పేకాట పరిశ్రమలో ఉద్యోగుల కింద లెక్క. ఈ వ్యవహారంపై ప్రభుత్వ నిఘా అధికారులు పూర్తి సమాచారం సేకరించి పోలీసులకు ఇచ్చినట్టు తెలిసింది.

## 8న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాక

(సత్యంన్యూస్, నరసన్నపేట)



ఈనెల 8న నరసన్నపేట మండలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పర్యటించనున్నారు. ఈమేరకు సంబంధిత కమిషన్ ప్రధాన కార్యాలయం గుంటూరు జిల్లా మంగళ గిరి నుంచి విడుదల చేశారు. మంగళ గిరి నుంచి గురువారం రాత్రి రోడ్డు మార్గాన బయలుదేరనున్న ఆయన శుక్రవారం ఉదయం నరసన్నపేటకు చేరుకోనున్న ఆయన ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ యాజమాన్యం నూతనంగా ఏర్పాటుచేసిన తల్లిపాలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలనలో వివిధ శాఖల అధికారుల సమన్వయంపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. భోజన అనంతరం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో మంగళగిరికి తిరిగి పయనం కానున్నారు.

## చేనేతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

(సత్యంన్యూస్, పొందూరు)

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు 1, 2, తోలాపి క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలలో లబ్దిదారులకు పరికరాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలుచేసిందని, ఈ పథకాల ద్వారా చేనేత కళాకారులకు మేలు జరిగిందన్నారు. అందరం చేనేత వస్త్రాలు వినియోగించి చేనేతని ప్రోత్సహించాలన్నారు. పొందూరు, తోలాపి లబ్ధిదారులకు 65 మగ్గం పనిముట్లు, 12 డాబీలు, 13 మోటరైజడ్ పర్న్ వైన్డింగ్ మెషిన్, 4 మోటరైజడ్ పర్న్ కం బాబిన్/ డబ్బా వైన్డింగ్ మెషిన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి అధికారి టి.జనార్ధనరావు, డీవోలు ఎస్.రమణమ్మ, వీజీ శంకర్‌రావు, ఆర్.శేఖ ర్, ఏడీవో ఎన్వీ రమణ, క్లస్టర్ సీడీఈలు, డిజైనర్స్ పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.